ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రాం

నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రాలు, మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, బాబు జగ్జీవన్‌రాం 116వ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని విగ్రహానికి బుధవారం వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

- ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘ సంస్కర్త, సంఘ సేవకుడని కొనియాడారు.
- ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడు బాబూ జగ్జీవన్‌రాం అని కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, కాంగ్రెస్ నాయకులు రంగినేని జగదీశ్వరుడు, రాముయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.
- ఈగలపెంటలోని జెన్‌కో సీఈ కార్యాలయం వద్ద బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

– 'సాక్షి' నెట్‌వర్క్


కొల్లాపూర్‌లో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు


అచ్చంపేటలో పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్


నాగర్‌కర్నూల్‌లో..


ఈగలపెంటలో...


నాగర్‌కర్నూల్‌లో ప్రజాసంఘాల నాయకులు


తెలకపల్లిలో కేవీపీఎస్ నాయకులు


కొల్లాపూర్ బాలికల గురుకుల పాఠశాలలో..


తెలకపల్లిలో తహసీల్దార్ లక్ష్మణ్, తదితరులు


పెంట్లవెల్లిలో..


వెల్దండలో...


కల్వకుర్తి జాగృతి ఆధ్వర్యంలో...


కల్వకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న ఎంపీపీ మనోహరా చెన్నకేశవులు


పెద్దకొత్తపల్లి మండలం వెనచర్లలో..


ఉప్పునుంతల మండలం వెల్టూర్‌లో...

క్లుప్తంగా

నల్లమల యువకుడికి సోషియాలజీలో డాక్టరేట్



అచ్చంపేట రూరల్: అచ్చంపేట పట్టణానికి చెందిన ఇంతియాజ్ రహీం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజీ డాక్టర్ బీనవేని రాంషెపర్డ్ నేతృత్వంలో తెలంగాణలోని ముస్లిం బాలికల సామాజిక, విద్యా స్థితిగతులు, సామాజిక శాస్త్ర విభాగంలో అధ్యయనం చేశాడు. పరిశోధన నివేదికలను అందించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగం వారు మంగళవారం ఇంతియాజ్ రహీంకు డాక్టరేట్ ప్రకటించారు. అచ్చంపేట ప్రాంతంలోనే విద్యాభ్యాసం చేశాడు. మహిళా శిశు సంక్షేమ శాఖలో మేడ్చల్ జిల్లా బాలల సంరక్షణ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. పీహెచ్‌డీ పట్టా పొందడం చాలా ఆనందంగా ఉందని తెలియజేశాడు.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో 8వ ర్యాంకు


నరేష్

ఉప్పునుంతల: మండలంలోని రాయిచెడ్‌కు చెందిన టి.నరేష్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో 8వ ర్యాంక్ సాధించాడు. ఇతను పాలమూరు విశ్వవిద్యాలయం నుంచి తానా పోస్టుగ్రాడ్యుయేట్‌ను పూర్తిచేశాడు. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించడంపై మండలంలోని ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు నరేష్‌ను అభినందించారు. భవిషత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శిగా వెంకటయ్య



నాగర్‌కర్నూల్ రూరల్: సీపీఐ నియోజకవర్గ కార్యదర్శిగా వార్ల వెంకటయ్య ఎంపికయ్యారు. స్థానిక సింగిల్‌విండో ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన్ను సీపీఐ నియోజకవర్గ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. వెంకటయ్య ఇదివరకే సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడిగా, రాష్ట్ర సమితి సభ్యుడిగా విధులు కొనసాగిస్తుండగా.. నియోజకవర్గ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ఈ నెల 14 నుంచి నియోజకవర్గంలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని చేపట్టనున్నారని, నియోజకవర్గంలోని 5 మండలాల్లో పాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలియజేశారు.

ఆరోగ్య తెలంగాణకు సీఎం కృషి

కల్వకుర్తిరూరల్: సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణ రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నివాసంలో మండలంలోని మార్చాలకి చెందిన లక్ష్మారెడ్డికి మంజూరైన రూ.లక్ష సీఎం సహాయనిధి చెక్కు, జయప్రకాశ్ నగర్ తండాకు చెందిన దశరథానికి మంజూరైన రూ.60 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. వివిధ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫొటో వీడియో గ్రాఫర్ల కమిటీ ఎన్నిక

పెంట్లవెల్లి: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మండలానికి చెందిన ఫొటో మరియు వీడియో గ్రాఫర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడి ఆధ్వర్యంలో మండల నూతన అధ్యక్షుడిగా ఖాజామైనొద్దీన్, మండల ప్రధాన కార్యదర్శిగా కేశంపోగుల చంద్రశేఖర్, కోశాధికారిగా సూరిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎండి షబ్బీర్, సైదులు, జాను, రాజేందర్, శంకర్, రామస్వామి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

ఉప్పునుంతల: మండలంలోని దేవదారికుంట తండాలో బుధవారం సీసీ రోడ్డు పనులను సర్పంచ్ పర్వతాలు నాయక్, గ్రామపెద్దలు ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే నిధులు రూ.35 లక్షలతో తండాలోని ఏడు కాలనీల్లో సీసీ రోడ్లు వేస్తున్నామని చెప్పారు. ఒక్కో రోడ్డు 120 మీటర్లు వేయనున్నామని చెప్పారు. వార్డు మెంబర్ గోపాల్, పంచాయతీ కార్యదర్శి రాహుఫ్, వసురాంనాయక్, పాండు, లోక్య, తిర్పతి జోద్య, బాలయ్య పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల అందజేత

కల్వకుర్తి రూరల్: యువకులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్వకుర్తి మండలంలోని ఎల్లికట్టకి చెందిన యువకులకు క్రికెట్ కిట్టును అందజేశారు. ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవలతో పాటు యువకులకు చేయూతనిస్తున్నట్లు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. రాజు, శ్రీపతిరాజు, గణేశ్ తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

వీరమనాయుని చెరువుకు కేఎల్‌ఐ నీళ్లు

కొల్లాపూర్: ఎన్మన్‌బెట్లలోని వీరమనాయుని చెరువుకు కేఎల్‌ఐ నీటిని మళ్లించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చెరువు కింద 4 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు భూములు ఉన్నాయని, చెరువులో నీళ్లు అయిపోతే పంటలు ఎండిపోయే పరిస్థితులు ఉంటాయన్నారు. గత పాలకులు కేఎల్‌ఐ కాల్వలు తవ్వించినప్పుడే వీరమనాయుని చెరువుకు కూడా నీళ్లు మళ్లించేలా డిజైన్లు చేయించి ఉంటే బాగుండేదన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లానని, చెరువుకు కేఎల్‌ఐ నీళ్లు మళ్లించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారని ఎమ్మెల్యే వివరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

కొల్లాపూర్ మండలంలోని చింతలపల్లికి చెందిన జె.కృష్ణయ్యకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2.50 లక్షల చెక్కు మంజూరైంది. ఆ చెక్కును బుధవారం లబ్ధిదారుడికి ఎమ్మెల్యే అందజేశారు.

కుట్రపూరిత చర్యలు

వెల్దండ: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక బీజేపీ నాయకులు కుట్ర పూరిత చర్యలకు పాల్పడుతున్నట్లు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వెల్దండలో విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల జీవితాలను అడ్డుపెట్టుకుని బీజేపీ నాయకులు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఉన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

అంగరంగ వైభవంగా పూల రథోత్సవం


లింగాలలో పూల రథంలో ఊరేగుతున్న సీతారామ సమేత లక్ష్మణుడు


కొల్లాపూర్‌లో మహిళల కోలాట ప్రదర్శనలు

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున ప్రధాన ఘట్టమైన పూల రథోత్సవం(పెద్ద తేరు)కనుల పండువగా నిర్వహించారు. రథాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించారు. రథం ఎదుట బ్రాహ్మణులు హోమం నిర్వహించి కుంభం పోశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బల్లారి నాగేశ్వర్ రథోత్సవం ఊరేగింపును ప్రారంభించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రధాన వీధుల వెంట భక్తులు రామనామంతో రథాన్ని లాగగా.. మహిళలు మంగళహారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రథం ఎదుట మహిళల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు..

ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి రాత్రి రథం ప్రారంభానికి ముందు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ కోనేటి తిర్పతయ్య, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ ప్రభుత్వ విప్ వెంట ఉన్నారు.

దేవతామూర్తుల ఊరేగింపు

కొల్లాపూర్: పట్టణంలోని రామాలయంలో బుధవారం రాత్రి దేవతామూర్తుల ఊరేగింపు నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణమూర్తులకు బుధవారం రాత్రి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు భజనకీర్తనలతో ఊరేగింపులో పాల్గొన్నారు. మహిళలు కోలాట ప్రదర్శనలు చేశారు. ఊరేగింపు కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ ఆలయంలో ఉత్సవాలు

ఊర్కొండ: హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం మండలంలో నిర్వహించే శోభాయాత్రలో భక్తులు పాల్గొనాలని పబ్బతి ఆంజనేయస్వామి పాలక మండలి బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. ఉదయం 7.30 గంటలకు దత్తాత్రేయ శర్మ శ్రీనివాసులు శర్మ ఇంటి నుంచి ఊరుకొండపేట పురవీధుల వెంట హనుమాన్ శోభాయాత్ర నిర్వహించాలని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ర్యాలీ అనంతరం ఆలయంలో యజ్ఞం నిర్వహించి, అనంతరం అన్నదాన ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పేర్కొన్నారు. గ్రామంలోని పబ్బతి ఆంజనేయ స్వామి దేవస్థానం యజ్ఞం నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

కొనసాగుతున్న జయంతి ఉత్సవాలు

కల్వకుర్తి రూరల్: సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు బుధవారం సుప్రభాతం, రుద్రాభిషేకం, లక్ష్మీహరహర రుద్రహోమం నిర్వహించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పాల్గొని పూజలు చేశారు. గోలి శ్రీనివాస్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందజేశారు.


కల్వకుర్తిలో పూజలు చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

అచ్చంపేట రూరల్: పదో తరగతి పేపర్ లీకేజ్ ముమ్మాటికీ బీజేపీ కుట్రనేనని అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు బండి సంజయ్‌పై ఫిర్యాదు చేశారు.

ఆర్థికసాయం అందజేత

కోడేరు: మండలంలోని తీగలపల్లికి చెందిన దేవర పాగ రాములు అనారోగ్యంతో బాధపడుతూ.. మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, సర్పంచ్ శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి పరామర్శించి రూ.6,000 ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు.

'మన ఊరు- మన బడి' పనులు ప్రారంభం

పెద్దకొత్తపల్లి: చంద్రకల్ ఉన్నత పాఠశాలలో 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో మంజూరైన డైనింగ్‌హాల్ పనులకు సర్పంచ్ గడ్డం నాగయ్య భూమి పూజ చేసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో అదనపు గదులు, వంటగదులను మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇందిర, రమేష్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ బంగారయ్య, స్వామి, కళమ్మ, శ్రీను, రవి, వెంకటయ్య, గుండయ్య పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం



వెల్దండ: గ్రామాల్లోని దేవాలయ అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ సహకారం అందిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ సభ్యులు వరప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఉబ్బలగట్టుతండాలో ఏలియాసాథ్ దేవాలయ నిర్మాణానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి సహకారంతో రూ.1.50 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ రెడ్డి మాట్లాడారు. గ్రామాల్లోని పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థికసాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గిరిజన తండాలు, గ్రామాల్లో గ్రామ దేవతల దేవాలయాలు అసంపూర్తిగా ఉండటంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించడానికి కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకట్‌నాయక్, దేవిలాల్, బాషా, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

గుర్తుతెలియని మహిళ శవం లభ్యం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సింగోటం గ్రామ సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి దగ్గరలోని చెరువులో పడి ప్రమాదవశాత్తు ఓ మహిళ(50) చనిపోయిందని ఎస్‌ఐ బాల వెంకటరమణ తెలపారు. ఆ మహిళను గుర్తుపట్టిన వారు కొల్లాపూర్ పోలీసులకు తెలియజేయాలని కోరారు.

అండగా ఉంటే హ్యాట్రిక్ విజయం సాధిస్తా..


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

లింగాల: మీ అండదండలతో రెండు సార్లు విజయం సాధించి మీకు సేవ చేసే భాగ్యం కలిగిందని, ఈ సారి కూడా అదే ఒరవడిని కొనసాగిస్తే హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం లింగాలకు సమీపంలోని మగ్దూంపూర్ చౌరస్తాలోని పద్మావతి శ్రీనివాస ఫంక్షన్ హాలులో బీఆర్‌ఎస్ శ్రేణులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తరలివచ్చిన పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ అనేది ఒక కుటుంబం లాంటిదని, గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే ఎవ్వరూ తమ విజయాన్ని ఆపలేరని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీకి కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఇటీవల పదో తరగతి హిందీ పేపర్ లీక్ వ్యవహారంలో బీజేపీ పాత్ర ఉందని, పేపర్ లీక్ వ్యవహారంలో సంబంధం ఉన్నవారు ఎంతటి వారైనా చట్టం తనపని తాను చేసుకుంటూ పోతుందని అన్నారు. మంగళవారం రాత్రి లింగాలలో బస చేసిన ప్రభుత్వ విప్ ఉదయం మండల కేంద్రంలోని పలు వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. దారారం, అవుసలికుంటలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన వ్యక్తుల కుటుంబాలను ప్రభుత్వ విప్ పరామర్శించారు. సుధీర్‌గౌడ్, హన్మంత్‌రెడ్డి, మాకం తిర్పతయ్య, జగపతిరావు, మంజుల పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి


జూపల్లిలో కూలీల మస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయసుధ

చారకొండ: వేసవిలో ప్రభుత్వం కల్పిస్తున్న జాతీయ ఉపాధిహామీ పథకం పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జయసుధ సూచించారు. మండలంలోని జూపల్లిలో బుధవారం ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్న వారందరికి ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పిస్తామని అన్నారు. కూలీల మస్టర్‌ను పరిశీలించి, హాజరు నమోదు చేశారు. మస్టర్‌లో తమ పేరును సరి చూసుకోవాలన్నారు. బినామీ పేర్లు లేకుండా చూసుకోవాలని, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఎండ తీవ్రత ప్రభావంతో కూలీలు పనిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట టీఏ యాదయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కందనూలు: పల్లెపల్లెకు ఓబీసీ, ఇంటింటికి బీజేపీ వాల్ పోస్టర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో బీజేపీ ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 6న పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని 14వ తేదీ, అంబేద్కర్ వర్ధంతి వరకు పల్లె పల్లెకు ఓబీసీ ఇంటింటికి బీజేపీ కార్యక్రమాలు నిర్వహించాలని ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్ పిలుపుమేరకు ఈ కార్యక్రమాలను ఉధృతంగా చేపడుతామని చెప్పారు. రాజవర్ధన్ రెడ్డి, నాగేష్, రాము, యుగంధర్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన


వెల్దండలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


కొల్లాపూర్‌లో అరెస్టయిన బీజేపీ నాయకులు

బీజేపీ స్టేట్ చీఫ్ బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ.. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్ రెడ్డి మాట్లాడారు. బండి సంజయ్ అక్రమ అరెస్టును ఖండిస్తున్నామని, ప్రశ్నిస్తే అరెస్టులు చేసే ఈ ప్రభుత్వం కేవలం అవినీతిపరులకు, దొంగలకు కొమ్ము కాస్తుందని ఆరోపించారు. బండి సంజయ్‌ని విడుదల చేయకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రాలు, మండలాల్లో బీజేపీ నాయకులు నరిసన తెలిపారు.

నాయకుల అరెస్టు..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్ట్ చేసినందుకు బీజేపీ శ్రేణులు నిరసనకు దిగే అవకాశాలు ఉండటంతో బుధవారం పోలీసులు ముందస్తుగా ఏ మండలానికి ఆ మండలంలో బీజేపీ నాయకులను అరెస్ట్ చేశారు.

– 'సాక్షి' నెట్‌వర్క్